రాంపండూ - డాన్సు డ్రామా

ఏప్రిల్ 22, శ్రీరామనవమి సందర్భంగా
"రా...రా...రామా...రా!"
కథ రచన
రాంపరం పాండురంగం(అనే రాంపండు)
గేయరచన
రాంపరం పాండురంగం(అనే రాంపండు)
సంగీతం
రాంపరం పాండురంగం(అనే రాంపండు)
కళాదర్శకత్వం
రాంపరం పాండురంగం(అనే రాంపండు)
నృత్యదర్శకత్వం
రాంపరం పాండురంగం(అనే రాంపండు)
దర్శకత్వం
రాంపరం పాండురంగం(అనే రాంపండు)

"ఉత్తరం వచ్చింది సర్" అంటూ ప్రకటించాడు అచలపతి అనంతం నిద్రలేవగానే.

"ఎవరి దగ్గర్నుంచి?" మత్తుగా అడిగేడు అనంతం కాఫీ కప్పు అందుకుంటూ. "రాంపండు గారి దగ్గర్నుండి."

"సుమనోహరితో ప్రణయం విఫలమయింది కాబట్టి ఆత్మహత్య చేసుకుంటున్నానని, ప్రేమికుల పట్ల వ్యవహరించే విధానం ఇది కాదని లోకానికి నా ద్వారా సందేశం పంపిద్దామనుకుంటున్నాడా?"

"ఉత్తరం పైన రాసిన సెంటు అటువంటి ఉద్దేశ్యాలున్నట్టు కనబరచడం లేదండి. పైగా ఇది మైలారం అనే ఊరునుండి వచ్చింది."

"ఇక చెప్పకు. వీడి కథ విని, విని బోరు కొట్టేస్తోంది. వీడు మళ్లీ ఇంకో పల్లెటూరు చేరి అక్కడ ఓ కుర్రాడికి ట్యూషన్ మేష్టరుగా కుదురుకుని ఉంటాడు. వాడి అక్కనో, అమ్మనో వలచి, వరించి నాకు చెప్తాడు. వాళ్లు నాకు బంధువులయి కూచుంటారు. చివర్లో వీడు ఘొల్లుమంటాడు. అసలు వీడి ప్రేమగాథలకు అంతే ఉండదా, నాకు తెలియక అడుగుతాను, అచలపతీ!" అని విసుక్కుంటూనే ఉత్తరం చింపి చదివేడు.

ఈసారి రొటీన్ కంటె భిన్నంగా ఉందని అనంత్‌కి ఒప్పుకోక తప్పలేదు. వీణాపాణి అనే ఈ అమ్మాయికీ, రాంపండు ట్యూషన్ చెప్పే అబ్బాయితో చుట్టరికం లేదు. అంతేకాదు, అనంత్‌తో కూడా చుట్టరికం ఏమీ లేదు. పైగా వాళ్లది ఆ ఊరు కాదు. వాళ్లనాన్న ఆర్కియాలజిస్టు. మైలారంలో వచ్చి తవ్వకాలు నిర్వహిస్తున్నాడట. వీణాపాణి, తమ్ముడు కూడా వచ్చి తండ్రి దగ్గర ఉంటున్నారట. మిగతా విషయాలు మాత్రం షరా మామూలే. ఆ అమ్మాయి ఎప్పటిలాగానే భారతదేశంలో పుట్టిన వీనస్. నడిచిన చోటల్లా వసంతం. నవ్వినప్పుడల్లా పూలవాన. ఇంతకుముందు రాంపండు ప్రేమించిన ఏ అమ్మాయికీ తీసిపోని లెవెల్లోనే ఉంది. రాంపండు ఆ అమ్మాయిని చూస్తేనే మెలికలు తిరిగిపోతున్నాడట. అందువల్ల అనంతూ, అచలపతీ వచ్చి ప్రేమ సఫలం చేసే ఉపాయాలు చెప్పాలట.

ఉత్తరం మడుస్తూ, "అచలపతీ, వీడు ప్రేమలో పడ్డ ప్రతీసారీ ఇంత కొత్తగా ఫీలవడం, ఆ అమ్మాయిని పలకరించలేకపోవడం వింతగా లేదూ?" అన్నాడు అనంత్.

"సూర్యుడు ప్రతీరోజూ ఉదయిస్తున్నా ఏ రోజుకారోజు ఉదయం ఫ్రెష్‌గానే ఉంటుంది కదా సర్" అన్నాడు అచలపతి.

"అలాగా, మనకు పెద్దగా తెలియదులే. కాస్త ఆలస్యంగా లేస్తాను కదూ" అంటూ అనంత్ అప్పటికి తన ఆశ్చర్యాన్ని కట్టిపెట్టాడు కానీ రెండు రోజుల తర్వాత మైలారంలో రాంపండు స్వయంగా తన ప్రేమకథ వినిపిస్తూన్నప్పుడు మళ్లీ అడిగిచూశాడు. ఆ సమయంలో రాంపండు అనంతాన్ని ఓ మట్టిదారి పక్కనున్న పొదలమధ్య కూచోబెట్టి ఉన్నాడు. వీణాపాణి వాళ్ల తమ్ముణ్ని తీసుకుని సాయంత్రం వాకింగ్‌కి వచ్చే దారి అదేట! ప్రశ్న విని రాంపండు మరింత ఆశ్చర్యపడ్డాడు. "ఆ దేవత ఎదుటబడి నిలవడమే కష్టం. ఆ తేజస్సు అలాటిది. పలకరించడం కూడానా, చాల్లే ఎవరైనా వింటే నవ్విపోతారు." అని కేకలేశాడు. చివరికి రాంపండు ఎదురు చూసిన ముహూర్తం రానే వచ్చింది. అప్సరసలు కూడగట్టుకుని వీణాపాణి వేషంలో ఆ దారిన రావడం జరిగింది. కానీ ఆమె ఒంటరిగా లేదు. పక్కన ఖాకీ పాంటు, చొక్కాటక్ చేసుకున్న పొడగరి యువకుడు తోడుగా ఉన్నాడు! రాంపండు మూర్ఛపోయి

వెనక్కి పడిపోయాడు. కానీ పొదల్లోని ముళ్లు గుచ్చుకోవడంతో లేచి కూచున్నాడు.

కొద్ది గంటల్లోనే అచలపతి పూర్తి సమాచారం అందచేసాడు. ఆ ఊళ్లో అతనికి తెలిసున్న బట్లర్ చెప్పినదాని ప్రకారం ఆ యువకుడి పేరు - పరశురామ్. తవ్వకాలలో ప్రసిద్ధుడు. వీణాపాణి తండ్రికి అతనంటే అభిమానం. అతను లేకపోతే పనిసాగదని చెప్పి హెడాఫీసుతో మాట్లాడి ప్రత్యేకంగా రప్పించాడు. పెళ్ళి కాలేదు. వీళ్ల పక్కనున్న క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. రాత్రుళ్లు గిటార్ వాయిస్తూంటాడు. వీణాపాణి తన కొచ్చినంత వరకు చిన్న పియానోలాంటి సింథసైజర్ వాయిస్తూంటుంది. ఇవి వింటూనే రాంపండు అమాంతం అచలపతి కాళ్ల మీద పడినంత పని చేశాడు. "అచలపతీ, నువ్వే ఏదో ఒకటి చేసి, ఈ కథ తక్కినవాటిలా ముగిసిపోకుండా చూడాలి. విలన్ ఇంత గ్లేమరస్‌గా ఉండడం ఏమీ బాగా లేదు. మంచి ఉపాయం చెప్పి వీణాపాణి దగ్గర నా గ్లామర్ పెంచు" అని బతిమాలేడు.

అచలపతి గొంతు సవరించుకున్నాడు. "కథలో మలుపులు రాకుండా పోవు సర్. నా మిత్రుడు చెప్పిన దాని ప్రకారం వీణాపాణిగారికి తమ్ముడంటే వల్లమాలిన అభిమానం. మీరు అతన్ని మచ్చిక చేసుకుంటే తప్పకుండా ఆమెకు దగ్గరవుతారు" అన్నాడు.

అనంతానికి మాత్రం చికాకు వేసింది. "అచలపతీ, నువ్వ చెప్పేది పరమపాత సలహా. ఈ ఐడియా ఆ పరుశురామ్‌కి కూడా వస్తుంది" అని తీసిపారేశాడు.

అచలపతి మాత్రం నిబ్బరం గానే ఉన్నాడు. "ఇది కాల పరీక్షకు తట్టుకున్న ఫార్ములా సర్. పైగా పగలంతా పరశురామ్‌కి గొడ్డలి పెట్టి తవ్వడానికే సరి పోతుంది. రాంపండు గారి దగ్గర బోల్డంత ఫ్రీ టైమ్ ఉంది".

***

రెండు వారాలు గడిచేయి. వీణాపాణి తమ్ముడు తనకు బాగా దగ్గరయ్యాడని రాంపండు ఉత్తరాలు రాస్తున్నాడు. అమ్మయ్య అని నిట్టూరుస్తూండగానే ఓ రోజు టెలిగ్రాం - రాంపండు నుండి! "వచ్చి నన్ను కాపాడు. లేదా ఎవరినైనా పంపి నా శవాన్ని తెప్పించుకో" అని.

"కథేమిటి ఇలా అడ్డం తిరిగింది, అచలపతీ?" అని అడిగేడు అనంత్.

అచలపతి దగ్గర సమాచారం రెడీగా ఉంది. అతని బట్లర్ ఫ్రెండు ఎప్పటికప్పుడు వార్తలు పంపుతూనే ఉన్నాడు. రాంపండు జీవితంలోకి భూషణం మళ్లీ ప్రవేశించాడు. రాంపండు వేంపూడిలో ఉండే రోజుల్లో ఇదే భూషణం స్కూలు ఆటల పోటీలపైన పందాలు కాసి రాంపండుని నానారకాలుగా ఏడిపించుకు తిన్నాడు. ఇప్పుడు అతనూ మైలారంలో బంధువులింట్లో తేలాడుట. రాంపండు కొత్త ప్రేమగాథ వినగానే దానిమీద బ్రాకెట్టు ఆడడం మొదలెట్టాడట. వీణాపాణి రాంపండుని వరిస్తుందా, పరశురాముణ్ని వరిస్తుందా అన్న సంగతి మీద పందాలు కాయమని ప్రోత్సహించి, కరక్టయితే ఇన్ని రెట్లు అన్ని రేటు ఫిక్స్ చేశాడట. తమ్ముడి ద్వారా వీణాపాణికి రాంపండు దగ్గరవ్వడం చూసి జనాలు రాంపండే పెళ్లాడతాడని పందాలు కాశారట.

"బానే వుంది. రాంపండు హాట్ ఫేవరెట్ అయ్యాడన్నమాట" అని సంతోషించబోయాడు అనంత్.

"కానీ అతను నెగ్గితే భూషణం వ్యాపారానికి దెబ్బ తగులుతుంది. అందుకని ఓ కుట్ర పన్నాడు సర్. ఓ రోజు సాయంత్రం వీణాపాణి తమ్ముడిని వెంటబెట్టుకుని రాంపండు

మార్కెట్‌కి వెళితే, అక్కడ భూషణం కనబడ్డాడు. అతని వెంట ప్రెసిడెంటు పేరయ్యగారి కొడుకు - వీణాపాణి తమ్ముడి వయస్సే - ఉన్నాడు. కుర్రాళ్లిద్దరిలో ఎవరు ఎక్కువ ఇడ్లీలు తినగలరో అన్నవిషయం చర్చకు వచ్చింది. భూషణం, రాంపండు పందాలు వేసుకున్నారు. కుర్రాళ్లు కూడా సై అన్నారు. పోటీ భీకరంగా సాగింది. వీణాపాణి తమ్ముడు రాంపండు తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయలేదు. పొట్ట పగిలేట్లా తిని పేరయ్యగారి అబ్బాయిని ఓడించాడు.

కథ ఇక్కడితో ఆగివుంటే బాగుండిపోను సర్. కానీ మర్నాడు పొద్దున్న కుర్రాళ్లిద్దరూ పొట్టలు చేత్తో పట్టుకుని బాధ పడడం, డాక్టర్లను పిలిపించడం జరగడంతో వీణాపాణికి సంగతంతా తెలిసిపోయింది. రాంపండు తన తమ్ముడి ప్రాణాలతో చెలగాటం ప్లస్ జూదం ఆడాడని తెలిసి ఆమె అసహ్యించుకొని రాంపండుకి ఆ మాట చెప్పేసింది. దాని పర్యవసానమే ఈ టెలిగ్రాం, సర్." అని ముగించాడు అచలపతి.

"ఇంత చెప్పినవాడిని, మరి వీణాపాణి అభిమానం ఎలా చూరగొనాలో ఏదో ఒక ఉపాయం చెప్పకూడదా, అచలపతీ" అన్నాడు అనంత్ విసుగ్గా.

"నా ఉద్దేశ్యంలో రాంపండుగారు సాంఘిక సేవ చేసి గ్రామ ప్రజల ఆదరాభిమానాలను చూరగొనడం మంచిది సర్. పదిమందీ మంచిగా మాట్లాడితే వీణాపాణి మనసు మారవచ్చు".

ఆ ముక్కే రాంపండుకి ఉత్తరం రాసి పడేశాడు అనంత్.

***

నాలుగు వారాలు గడిచేయి. ఓ రోజు అనంత్ ఇంటికి తిరిగి వచ్చేసరికి రాంపండు అతని పక్క మీద తిష్టవేసి ఉన్నాడు. సుఖంగా నిద్రపోవాలిట. లేకపోతే రాత్రి రెండు షోలు వరసగా చూడడం కష్టమట. అనంత్‌కు తలా, తోకా అందలేదు. రాంపండు అందించాడు.

దాని ప్రకారం అచలపతి సలహాను రాంపండు అక్షరాలా పాటించాడు. జనాలకు మొదట్లో ఉన్న సందేహాలు క్రమంగా పటాపంచలు అయిపోయాయి. రాంపండంత మంచివాడు లేడన్న సంగతి దావానలంలా వ్యాపించింది. రోగిష్టి వాళ్లకు సేవలు, వృద్ధులకు పాఠాలు, పట్నం వెళ్లి రైతులకు విత్తనాలు తేవడాలు, లావాదేవీలు జరపడానికి డాక్యుమెంట్లు రాసి పెట్టడాలు - వేయేల, రాంపండు అందరికీ తలలో నాలుక అయిపోయాడు. జనాలంతా ఏకగ్రీవంగా ఈసారి రామనవమి ఉత్సవాలు రాంపండు చేతుల మీదుగానే జరగాలని నిశ్చయించారు. ముఖ్యంగా ప్రతీ ఏటా స్కూలు పిల్లల చేత వేయించే "శ్రీరామజయం" అనే నృత్యనాటిక ఈసారి రాంపండు ఆధ్వర్యంలోనే జరగాలని యావన్మందీ ప్రతిపాదించడం, పాత కోపాన్ని పక్కకు పెట్టి ప్రెసిడెంటు పేరయ్యగారు సరేననడం జరిగింది.

రాంపండు మంచివాడని లోకమంతా కోడై కూస్తుంటే, తను మాత్రం వేరే కుంపటి ఎందుకు పెట్టాలని వీణాపాణి కూడా రాంపండు ఎడల తన మనస్సు మార్చుకుంది. ఈ డ్రామాకు హార్మోనియం తనే వాయిస్తానంది. పరశురాముడికి తవ్వకాల్లో ఉన్న మజా, అమ్మాయిలను షికార్లకు తిప్పడంలో లేనట్టుందని గ్రహించిందేమో!

"అంతా బాగానే వుంది. మరి అక్కడే వుండి "శ్రీరామజయం" నాటకం సంగతి చూసుకోకుండా ఇక్కడకొచ్చి పడ్డావేం?" అని అడిగేడు అనంతం.

"ఆ పని మీదే వచ్చా. ఊళ్లో పాప్ డాన్స్ పోటీలు జరుగుతున్నాయి కదా. అవి చూసి వాటిల్లో కొన్ని పాప్యులర్ ఐటమ్స్‌ను ఆ నాటకంలో పెడదామని ప్లాను. ఇంక డిస్టర్బ్ చేయకు. పడుక్కోనీ, రాత్రి మూడు డాన్స్‌లు వరసగా చూడాలి" అంటూ రాంపండు అటు తిరిగి పడుకున్నాడు.

"ఒరే సన్నాసీ, పిచ్చిపిచ్చి ప్రయోగాలు చేయకు. అసలే నువ్వు వీణాపాణి మనసు దోచుకుంటావా లేదా అన్న విషయం మీద భూషణం గాడు బ్రాకెట్టు నడిపిస్తున్నాడు. మైలారం జనమే కాదు, పక్కవూళ్ల జనాలు కూడా ఎగబడి పందాలు కడుతున్నారు..." అని అనంతం ఏదో అంటూండగానే రాంపండు లేచి కూర్చున్నాడు.

"ఏమిటీ, పవిత్రప్రేమ, అదీ ఒక హృదయానిది కాదు, రెండు హృదయాలది. దాని మీద ఈ పాడుజనులు పందాలు కడతారా? వీళ్ల నెత్తి మీద రాళ్లు కురవ్వా? మజ్నూకాలంలో కూడా ఇంత ఘోరం లేదనుకుంటాను. అవునొరే, అది సరేగానీ పరుశురామ్ గాడి మీద ఎన్ని రెట్లు ఇస్తున్నాడురా?"

"ఛీ, నీకు సిగ్గులేదురా. నీలాటి ఆజన్మజూదరి జన్మలో బాగుపడడురా! భూషణం గాడు ఏదో కుట్రపన్ని నాటక ప్రదర్శన చెడగొడతాడు చూసుకోరా అని చెబుతూంటే పందెం గురించి అడుగుతావేమిట్రా? నేను చెప్పను ఫో" అని అనంత్ విసుక్కున్నాడు.

ఆ మర్నాడు తెల్లవారు ఝామున మైలారం బస్సెక్కుతూ రాంపండు అనంత్‌కి ఫోన్ చేశాడు. "ఒరేయ్, 'శ్రీరామజయం' అనే పేరు ఓల్డ్ స్టయిల్‌లో లేదూ, సపోజింగ్, 'రా... రా... రామా... రా!' అని పెడితే మోడ్రన్ టచ్ ఇచ్చినట్టా ఉండదూ" అని. సమాధానంగా అనంత్ వినిపించిన తిట్లు వినబడ్డాయో లేదో తెలియదు గానీ మూడో రోజుకి పోస్టులో ఒక పెద్ద వాల్‌పోస్టర్ వచ్చింది.

మైలారం శ్రీరామ సేవాసమితి వారు

ఏప్రిల్ 22, శ్రీరామనవమి సందర్భంగా

సమర్పించు

అధునాతన పౌరాణిక నృత్యనాటిక

"రా... రా... రామా... రా!"

కథా రచన

రాంవరం పాండురంగం (అనే రాంపండు)

గేయరచన

రాంవరం పాండురంగం (అనే రాంపండు)

సంగీతం

రాంవరం పాండురంగం (అనే రాంపండు)

కళాదర్శకత్వం

రాంవరం పాండురంగం (అనే రాంపండు)

నృత్యదర్శకత్వం

రాంవరం పాండురంగం (అనే రాంపండు)

సాయంత్రం 7 గంIIలకు రంగనాయకులు ఆడిటోరియంలో

అందరూ ఆహ్వానితులే

రండి, రండి, ఇది రామలీల కాదు, రాంపండు లీల

చూడండి, చూసి తరించండి, రాంపండును మెచ్చి రాముడి మెప్పు పొందండి.

పోస్టర్‌ను పూర్తిగా చదివేక "అచలపతీ, మన రాంపండుకి ఇంత కీర్తికాంక్ష ఉందని తెలియదు సుమా" అన్నాడు అనంత్ తెల్లబోతూ.

"పల్లె ప్రజలకూ, పట్నవాసం ప్రజలకూ ఉన్న తేడా రాంపండు గారు గుర్తించి నట్లు లేదు సర్. ఇంత పబ్లిసిటీని పట్నంలో భరిస్తారు గానీ, పల్లె ప్రజలు నిరసిస్తారు. భూషణం గారి అంచనా తప్పదని అనిపిస్తోంది సర్".

"ఈ ప్రదర్శన గురించి కూడా భూషణం బెట్లు కట్టిస్తున్నాడా?"

"అవునుసర్. ఇటు రాంపండుగారికి పెరుగుతున్న ప్రాముఖ్యత చూసి, అటు పరశురాముడి ఛామ్ చూసి ప్రజలంతా కన్‌ఫ్యూజ్ అయి పందాలు కట్టడానికి వెనకాడుతున్నారు. అందువల్ల ఆ పెళ్లి పందాన్ని రెండుగా విడగొట్టి, ఈ ప్రదర్శన సక్సెస్ గురించి విడిగా పందాలు కట్టిస్తున్నాడు భూషణం. మీరు రాంపండు గారిని హెచ్చరిస్తే మంచిది. ప్రదర్శన జయాపజయాల మీద చాలా ఆధారపడి వుంది".

"నాటక ప్రదర్శనకు రమ్మనమని మరీ మరీ రాశాడు. ఎలాగు వెళ్లేది కాస్త ముందుగా వెళితే ఏదైనా పొరబాటుంటే సవరించవచ్చు" అన్నాడు అనంత్ సానుభూతి చూపుతూ.

అన్నాడే కానీ మైలారం వెళ్లినా రాంపండుని కలవడం గగనం అయిపోయింది. ఆ నృత్యనాటిక మీదనే తన జీవితమంతా ఆధారపడినట్లు, తన యావచ్ఛక్తినీ, యావత్ సమయాన్నీ దానికే కేటాయించాడు రాంపండు. తన స్క్రీన్ ప్లేలో వేలుపెడితే స్నేహితుడని కూడా చూడకుండా చంపేస్తానన్నాడు. దానికి తోడు ఊరిప్రజల ఉత్సాహం కూడా ఉరకలు వేస్తోంది. ఈసారి పట్నవాసం కుర్రాడొకడు వచ్చి కొత్త, కొత్త ఛమక్కులు చూపబోతున్నాడని, అవేమిటో చూడాలనీ ఆరాటపడుతున్నారు. పందాల మీద పందాలు వేసుకుంటున్నారు. భూషణం పని యమబిజీగా ఉంది.

ప్రదర్శన రోజు ఆడిటోరియం నిండి పోయింది. గుండెలు పీచుపీచుమంటూండగా అనంత్ ఆడిటోరియం వెనకబెంచీలో - ఏదైనా అఘాయిత్యం జరిగితే పారిపోవడానికి వీలుగా - గుమ్మం దగ్గర కూచున్నాడు. కాసేపు పోయాక చూస్తే పక్కనే పళ్లికిలిస్తూ భూషణం! "ఏంటి గిరాకీ?" అన్నాడు అనంత్ కళ్లెగరేస్తూ.

"చెప్పు. నాటకం పూర్తిగా ఆడుతుందో లేదో పందెం కడతావా? రేట్లు చెబుతాను" అన్నాడు సిగ్గుమాలిన భూషణం.

"ఛస్తే కట్టను. నువ్వేదో చేసి ఈ నాటకం చెడగొడతావనిపిస్తోంది" అన్నాడు అనంత్ ఒళ్లు మండుతూండగా.

"రాంపండు ఉండగా ఇంకోడికి ఆ ఛాన్సెందుకిస్తాడు?" అన్నాడు భూషణం వెకిలినవ్వు నవ్వుతూ. అంటూనే "అదిగో ఆడిటోరియం ఎలక్ట్రీషియన్. అతనితో కాస్త పనుంది. వస్తా" అని పరిగెట్టాడు.

నాటకం తెర తీశాక మొదటి రెండు సీన్సులోనూ రాంపండు ఉనికి తెలియలేదు. అంటే బొత్తిగా తెలియలేదని కాదు. పిల్లలు డైలాగులు చెప్పడం మర్చిపోయినప్పుడల్లా అతని

కంచుకంఠం మైకులో సంభాషణలు అందిస్తోంది. 'ఆ ప్రాంప్టింగుగాడికి మైకు తీసేసి, ఈ పిల్లలకు పెట్టండేస్" అంటూ అరిచేడో గడుగ్గాయి ఆడియన్స్‌లోంచి. "మైకులో సంభాషణలు అందించునది - రాంవరం పాండురంగం (అనే రాంపండు)" అంటూ వెక్కిరించాడు ఇంకో గ.గా. హాల్లో భూషణం మనుష్యులు నలుమూలలా కాసుకుని ఉన్నట్టు అనుమానం వచ్చింది అనంతానికి. అంతలోనే సడన్‌గా కరెంటు పోయి హాలంతా చీకటయిపోవడంతో ఆ అనుమానం బలపడింది.

రాంపండు ఈ అవకాశాన్ని విడవదలచు కోలేదు. "లేడీస్ అండ్ జెంటిల్మన్, ఎక్కడో ఏదో పొరబాటు జరిగి లైట్లు పోయాయి" అని స్టేజి మీద నుండి ఎనౌన్స్ చేసాడు. "వాటె తెలివి! వాటె తెలివి!" "వాటె డిస్కవరీ! వాటె డిస్కవరీ!" అంటూ గడుగ్గాయిలు ప్లస్ ఆకతాయిలూ అరిచారు. "ఈ అద్భుతమైన ఎనౌన్స్‌మెంటు చేయువారు - రాంవరం పాండురంగం (అనే రాంపండు)" అంటూ పాత గడుగ్గాయి మళ్లీ అరిచాడు. హాలంతా గొల్లుమని నవ్వులు.

ఐదు నిమిషాల తర్వాత లైట్లు వచ్చినా, పది నిమిషాల దాకా సద్దుమణగలేదు. చీకట్లో సీట్లు మార్చేసిన వాళ్ల మీద, కాళ్లు తొక్కేసిన వాళ్ల మీద పోట్లాడేవాళ్లు ఎక్కువయిపోయారు. స్టేజి మీద నడిచేది ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిస్థితి అదుపులోకి తేవడానికి డైరెక్టరు రాంపండు అమోఘమైన ఆలోచన ఒకటి చేశాడు. హఠాత్తుగా ఎక్కణ్నుంచో హనుమంతుడు వెలిశాడు. వెలిసి డిస్కోడాన్సు చేసేశాడు. జనాలంతా నిర్ఘాంతపోయి చూడడంతో సైలెంటు అయిపోయారు. నాటకం ముందుకు సాగింది.

కాస్సేపటికి శూర్పణఖ వచ్చి లక్ష్మణుడ్ని చూసి "అమ్మ నీ కమ్మని కోత" పాట అభినయిస్తుండగా రాంపండు ప్రెసిడెంటుగారిని మచ్చిక చేసుకునేందుకు దాచుకున్న బ్రహ్మాస్త్రం బయటకు లాగేడు. "వేదిక మీదకు వచ్చి బాల కళాకారులతో బాటు ఆడి, పాడి వారిని ఉత్సాహ పరచవలసినదిగా ప్రెసిడెంటు పేరయ్యగారిని వేదిక మీదకు ఆహ్వానిస్తున్నాను' అని ఎనౌన్సు చేసేశాడు.

అందరూ ఆయన కేసే చూడడంతో పేరయ్యగారు తెల్లబోయి, మొహం ఎర్రబోయి, విసవిసా బయటకు వెళ్లిపోయాడు. ఆయన వెంటనే ఆయన కుటుంబం. రాంపండు "పోనీ మునసబుగారు..." అంటూ ఇంకోళ్లను పిలవబోతుండగా కరణంగారు వింగ్స్‌లోకి పరిగెత్తుకుని వెళ్లాడు. వెంటనే ఆయన రాంపండుని మందలించినది మైకులో వినబడింది కూడా - "మీ పట్నవాసాల్లా ఉండదిక్కడ. చాటుమాటు సరసాలే కానీ స్టేజెక్కి గంతులెయ్యరు. రేపాయన ఊళ్లో తలెత్తుకు తిరగాలా?"

"ఈ పల్లెటూరి గబ్బిలాయిలతో ఇదే గొడవ. ఏదీ స్పోర్టివ్‌గా తీసుకోరు." అంటూ రాంపండు విసుక్కున్నది కూడా గట్టిగానే వినబడింది. దానికి సమాధానంగా హాల్లో విజిల్స్, కేకలు, లైట్లు పోవడం జరిగింది. 'ఈ చెత్త వాగుడు వాగినది - రాంవరం..." అంటూ పాత గడుగ్గాయి మళ్లీ గళం విప్పాడు.

నాటకానికి హైలెట్ క్లయిమాక్స్‌లో పెట్టాడు రాంపండు. సిటీలో చూసిన ఓ పాప్ గ్రూపు సాంగ్‌లోంచి దాన్ని సరాసరి పిక్కాడు. స్టేజి మీద నటీనటులంతా "ఆరంజెస్, ఆరంజెస్,నీకో ఆరంజ్, నాకో ఆరంజ్' అంటూ నారింజ కాయలు జనాల్లోకి విసురుతారు. అంటే నిజం నారింజకాయలు కాదు. ఆ ఆకారంలో పూలుతో చేసినవన్న మాట. అదీ అందమైన అమ్మాయిలు అలవోకగా, తమాషాగా విసురుతుంటే ప్రేక్షకులు పులకరించి పోతారు.

రాంపండు కూడా అలా పులకరించిపోయాకనే దాన్ని తన నాటకంలో ప్రవేశపెట్టాడు. రాముడి పట్టాభిషేక సమయంలో జనాలంతా ఆనందం పరవళ్లు తొక్కుతూ, ఇలా నారింజకాయలు విసురుతారని వాడి కల్పన.

ఆలోచన వరకు బాగానే ఉంది. కానీ దాన్ని అమలు చేయడంలో వచ్చింది చిక్కు. ఈ నాటకంలో ఉన్నవి నిజం నారింజకాయలు. అవి కూడా పిల్లలు యథాశక్తీ కొద్దీ, జబ్బసత్తువ కొద్దీ ప్రేక్షకులలోకి విసిరికొట్టారు. స్టేజికి అల్లంత దూరంలో కూచున్న అనంత్ మొహం మీద కూడా ఒకటి తగిలి చితికి కళ్లలోకి రసం చిప్పిల్లిందంటే ఆ దృశ్యం ఎంత రసాభాస అయిందో ఊహించుకోవచ్చు. నారింజ దెబ్బలు తప్పించుకోవడానికి జనాలంతా లేచి పరుగులు పెట్టారు. కొన్ని డైరక్టుగా తగిలితే, కొన్ని గోడలకు కొట్టుకుని చితికి నెత్తి మీద రసం పోశాయి. కళ్లు మండడంతో కొందరు కసికొద్దీ అవే నారింజకాయల్ని పట్టుకుని స్టేజిమీదకు విసిరేశారు. ఆకతాయిలు ప్లస్ గడుగ్గాయిల గుంపు ఈ విషయంలో ప్రధాన పాత్ర వహించింది. గాలిలో ఎక్కడ చూసినా నారింజకాయల వాసనే, నారింజకాయల బాంబులే.

రాంపండు పరిస్థితి ఎలా వుందో చూడడానికి అనంతం స్టేజి మీదకు పరుగులు పెట్టాడు. అప్పటికే లేటయ్యింది. వీణాపాణి రాంపండును ఛడామధా తిట్టి, జన్మలో తనకు మొహం చూపించవద్దందిట. "ఏమిట్రా ఇది?" అంటే రాంపండు సగం ఏడుస్తూ చెప్పాడు– "నేను వూలు నారింజకాయలే చేయించానురా. బోల్డు డబ్బు తగలేశా. కానీ భూషణం గాడు పిల్లలకు లంచం పెట్టి అసలు నారింజకాయలు పెట్టాశాడట. రిహార్సల్స్‌లో నేను కాస్త స్ట్రిక్ట్‌గా ఉండటంతో పిల్లలకు కూడా విసుగుపుట్టి వాడి ఐడియాకు సరేననేశారట. ఎంత అన్యాయమో చూడు".

"అది తర్వాత చూస్తాను కానీ నువ్వు ముందు దీనికి దొడ్డిదారి ఏదైనా ఉందేమో చూడు. పారిపోయి ప్రాణాలు రక్షించుకో" అని చెప్పేసి అనంతం స్టేజి దిగేశాడు.

ఊరికి తిరిగొచ్చాక అచలపతిని పరామర్శించేడు – "పాపం నువ్వు చెప్పిన ప్లానులు ఫలించలేదోయ్. రాంపండు ప్రేమ మళ్లీ ఫెయిలయింది. పాపం నీకు బాధగా ఉందేమో!" అని.

'మరీ అంత బాధలేదు సర్. రాంపండుగారి ప్రేమ ఎలాగైనా విఫలమవుతుందని నేనూ బెట్ కట్టాను. మా స్నేహితుడి ద్వారా భూషణం గారు కట్టించుకున్నారు. ఓ ఐదువందల దాకా కలిసి వచ్చిందనుకోండి' అన్నాడు అచలపతి కాస్త వినయంగానే వంగి.